# అమ్మ మనసు

గోండి మూలం-పుష్ప పద్దా

**తెలుగు అనువాదం-సుస్మిత**





మాతృదినం

## అమ్మ మనసు

### (ఒక మీనా, ఒక మానో, ఒక పుష్ప, ఒక సుజాతా)

గోండి మూలం-పుష్ప పద్దా

తెలుగు అనువాదం-సుష్మిత

'పప్పా, జల్దీ ఆనా' ('నాన్నా, త్వరగా వచ్చేయి') అంటున్న చిన్నారి పిలుపు కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హస్ చెవులలో పదే పదే వినపడుతోంది. ఆయన మావోయిస్టు గెరిల్లాల చేతులలో ఓ యుద్ధబందీ. ఆయన పీ.ఎల్.జీ.ఏ. గెరిల్లాల కస్టడీలో, జనతన సర్కార్ ఆధీనంలో ఉన్నాడు. బీజాపుర్ జిల్లా జీరగూడ వద్ద 2021 ఏప్రిల్ 3నాడు జరిగిన గెరిల్లాల భారీ ప్రతిదాడిలో ఆయనను ప్రజా మిలీషియా కార్యకర్తలు అరెస్టు చేసి జనతన సర్కార్‌కు అప్పగించారు. ప్రతిక్షణం ట్రిగ్గర్‌పై వేలుతో ఉన్న ఫలితంగానే ఆయన్ని తమ కస్టడీలోకి తీసుకోవడం ప్రజా మిలీషియాకు ప్రాణాలతో చెలగాటంగానే ఉండింది. ప్రజల సహకారం లేకుంటే ఆయన సజీవంగా బందీ అయ్యేవాడా! చెప్పలేను.

ఆ భీకర సంగ్రామంలో ఆయన సోదర కోబ్రా కమాండోలతో పాటు వివిధ బలగాలకు చెందిన 28 మంది పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు జవాన్‌లు మృతి చెందారు. మరో 35 మంది వరకు గాయపడినారు. 'యుద్ధంలో జయమే కలుగుతుందనీ గర్వపడకూడదు. మిమ్మల్ని మీరు రక్షించుకుంటూ యుద్ధం చేయాలి' అనే నీతి రామాయణ కాలం నుండి నడుస్తోంది. కానీ రెండు వేల మంది సాయుధ బలగాలు తమ అధికారులు పంపడంతో అడవులను జల్లెడ పట్టి చివరకు దెబ్బతిని 'ఉల్టా ఫసాయా' అనుకుంటూ కాలికి బుద్ధి చెప్పారు. జీరగూడ యుద్ధ చర్యలో ఒక మహిళ సహా నల్గురు గెరిల్లాలు అసువులు బాసారు. ఈ వార్త గెరిల్లాల చెర నుండి మన్హస్ విడుదల వరకు సామాజిక మాధ్యమాలలో సైతం సర్వత్రా పెద్ద సంచలనం సృష్టించింది.

'ముఝె జల్దీ ఛోడ్ దో, ఘర్‌వాలే పరేషాన్‌హై' ('నన్ను త్వరగా వదలండి, మా ఇంటి వాళ్లు చాలా ఆందోళన పడుతున్నారు') అంటూ రాకేశ్వర్ మన్హస్ పదే పదే గెరిల్లాలను కోరుతున్నాడు. ఆయనకు జమ్మూలోని తన కుటుంబం గురించే చింత. గెరిల్లాల నుండి విడుదలయ్యాక ఉద్యోగం ఉంటుందా, ఊడుతుందా అనేది కునుకు పట్టని ప్రశ్న. ఆయనకు అబ్బిన కమాండో శిక్షణ ఫలితంగా ప్రాణ భయంతో ఆయన గెరిల్లాలను నమ్మడం లేదు. దానితో బందీగా మారాక దాదాపు ఒక రోజున్నర వరకు ఆయన వాళ్లు ఇచ్చిన మంచి నీళ్లు సైతం ముట్టలేదు. అన్ని స్థాయిల గెరిల్లా కమాండర్లు ఆయనకు తమ విప్లవ లక్ష్యాలు, ఉద్దేశ్యాలు చాలా ఓపికగానే వివరిస్తున్నారు.

యుద్ధ ఖైదీలతో మర్యాదగా వ్యవహరించాలనే విప్లవ నియమాన్ని గెరిల్లాలు అక్షరాల పాటిస్తూ మన్హాస్‌తో మసలుకుంటున్నారు. క్రమంగా రెండో రోజు వరకు మన్హాస్‌కు విప్లవ శిబిరం వాతావరణం బోధపడింది. గెరిల్లాల మంచితనం అర్థమవుతోంది. తనను వదలిపెడుతారన్న నమ్మకం కుదిరింది. క్షుద్బాధ తీర్చుకోసాగాడు. ఆయనకు మొదట తన ఇల్లు, పిల్లలు, కుటుంబం, ఉద్యోగం యావే తప్ప గెరిల్లాలు చెపుతున్నది వాళ్ల గొడవగానే అనిపించేది. కానీ, గెరిల్లాలు ప్రభుత్వం మధ్యవర్తులను పంపాలనీ తెలిపినపుడు మాత్రం ఆయన కళ్లు చెమ్మగిల్లాయి. మీడియా వారితో మాట్లాడాలన్నపుడు మాత్రం ఆయన ఎందుకో కానీ, చాలా జడుసుకున్నాడు. 20 గ్రామాల నుండి చేరిన వేలాది ప్రజల సమక్షంలో నిలబడి ఆయన వారినుద్దేశించి మాట్లాడింది బహుశా ఆయన జీవితంలో ఒక అవిస్మరణీయ ఘట్టంగా మిగిలిపోతుంది. కొంతమంది ప్రజలు ఆయన్ని వదలాల్సిన అవసరం లేదని తమ అభిప్రాయం చెప్పినప్పటికీ అధిక శాతం ప్రజలు క్షమించి వదలాలన్నారు. ప్రజాకోర్టు ప్రభుత్వ మధ్యవర్తులు పద్మశ్రీ ధర్మపాల్ సైనీ, తెల్లం బొరయ్య గార్లకు ఆయన్ని అప్పగించింది. ఆయన ఆ ప్రజాకోర్టుకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాడా! లేదా! చూడాల్సిందే.

'ఉన్‌కో జల్దీ ఛుడ్‌వావో, పైలట్ అభినందన్ జైసా జల్దీ ఛుడ్‌వావో మోదీ జీ' మన్హాస్ మల్లియ మీనూ హృదయ విదారకమైన రోదనలు మీడియా రోజూ వినిపించేది. కానీ ఆ 'హిందూ హృదయ సామ్రాట్' మాత్రం వాటిని గమనించి ఉండడు. ప్రజలలో గెరిల్లాలను అప్రతిష్ట పాలు చేయడం, వారి 'పాషణ' హృదయాన్ని తెరకెక్కించడమే సంచలనాత్మక వార్తలంటూ సొమ్ము చేసుకునే మీడియాకు కావాల్సింది. కానీ పాపం! మీనూ మన్హాస్‌కు మోదీ కౌటిల్యం తెలియదనీ ఆమె రోదనలే తెలుపుతున్నాయి.

2001 అక్టోబర్ 7 నాడు గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మోదీ గత 20 సంవత్సరాలలో ప్రతి తడవ ఎన్నికలలో ముందరికన్నా అధికంగా అబద్దాలు, దౌర్జన్యాలు, దుర్మార్గం, ఉన్మాదం, అక్రమాలు, అవినీతి, హత్యలు, అత్యాచారాలకు పాల్పడడంలో అందెవేసిన చేయి కావడంతోనే ఆ 'హిందూ హృదయ సామ్రాట్' అధికారాన్ని కైవశం చేసుకోగలుగు తున్నాడనీ రాష్ట్రం నుండి కేంద్రానికి ఎగబాకాడనీ శ్రీమతి మన్హాస్‌కు చెప్పే సందర్భం కాదిది. దేశ ప్రధానీ పదవీ కోసం పుల్వామా దాడి ఎంత నాటకీయంగా జరిగిందో, అంతకన్నా నాటకీయంగా అభినందన్ అరెస్టు, విడుదల జరిగిపోయాయి అనేది ఓటర్లకు తెలువనంతకాలం మోదీ చాణక్యనీతి వర్ధిల్లుతుంది. మన్హాస్ విడుదలకు ఎవరి విజ్ఞాపలు వెలువడకముందే గెరిల్లాలు ఆయన్ని సురక్షితంగా వదిలేస్తామని ప్రకటించేశారు.

ప్రపంచ తల్లుల దినం సందర్భంగా శ్రీమతి మీనూ మన్హాస్‌కు నేను ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయదలచుకున్నాను.

మీనూ, నీవు ఒక పాపకు తల్లివి. ఒక ఇల్లాలివి. ఆయన గెరిల్లాల అదుపులో ఉన్నపుడు ఏ

హెబియస్ కార్పస్ అవసరం లేకుండానే, నీ భర్త మన్హస్ యోగక్షేమాలు నీకు వెంట వెంట గెరిల్లాలు తెలుపుతూ వచ్చారు. సామాజిక మధ్యమాల పుణ్యమా అంటూ ఏ దాపరికం లేకుండా ఆ వార్త నీ వరకు క్షణ క్షణం ఉత్కంఠ భరితమైన క్షణాలలో నీకు చేరి నిన్ను ఓదార్చి ఉండాలి. ఆయన మీద ప్రజా కోర్టులో మీ చట్టాల ప్రకారం సీఆర్‌పీసీ 307 సహా అనేక ఆరోపణలు వచ్చాయి. కోరోనా వాహకులుగా అడవులలో, ఆదివాసీ గూడాలలో గస్తీ చేయడం జతనన సర్కార్ నియమాల ప్రకారం పోలీసుల అతి పెద్ద నేరం. అయినప్పటికీ, యుద్ధ బందీ కావడంతో నీ భర్తను విచారించి వదిలారు.

కానీ, సోదరీ, జీరగూడ రణభూమిలో (కిల్లింగ్ జోన్) ప్రాణభీతితో పారిపోయిన అనేక వందల సోదర ఖాకీ కమాండోలు వదిలివెళ్లిన మృత జవాన్‌ల శవాలు మాత్రం అక్కడే అత్యంత దైన్యంగా రోజంతా పడున్నాయి. ఏ దిక్కులేని స్థితిలో వాటిని ఊరి పందులూ, కుక్కలూ పీక్కు తిన్నాయి. ఖాకీల శవాలకు ఆ గతి పట్టడానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష వైఖరి తప్ప మరేం కాదు. దాదాపు 24 గంటలకు పైగా వాటిని ఏ ప్రభుత్వ, పోలీసు ఉన్నతాధికారి పట్టించుకోలేదు. మానవత్వంతో స్థానిక మూలవాసీ ప్రజల మనసులు తన్లాడినా వాటి చెంతకు చేరడానికి వారు సాహసించలేదు. ఆ పనే చేస్తే ఆ తెల్లారి బూర్జువా చట్టంతో వారికి ఎదురయ్యే సవాలక్ష సవాళ్లకు జవాబులు తెలియవనీ ఆ ఆదివాసీ జనాలు వాటి కాపలాకు సిద్ద పడలేదు. గెరిల్లాలు స్వతఃగా ఆ శవాలకు కాపు కాయడం అంటే వారు మరో దాడికి సిద్ధమవడమే. ఆ రిస్క్ ఆ టైంలో తీసుకోవడం వారికి భావ్యం కాదు. అలాంటి దుస్థితిలో వృత్తిధర్మాన్ని పాటించని, సంవేదనారహిత పాత్రికేయ ప్రబుద్ధులు కొందరు దొరికిందే అదనుగా శవాలతో గెరిల్లాల దాష్టీకం అంటూ వాస్తవాలతో సంబంధం లేని 'న్యూసెన్సెషనల్' నాన్‌సెన్స్ వార్తలతో రంగంలోకి దిగారు. నిజానికి వారికి గెరిల్లాల విలువలు, సంస్కృతి తెలియవు. తెలిసినా వారికి అవి జీర్ణం కావు. మా రావణ రాజును సంహరించిన మీ రాముడు ఆయనకు పరలోక హితం కోసం సంస్కరణలన్నీ చేయిస్తూ 'ప్రాణాలున్నంత వరకే శతృత్వాలు, కానీ ప్రాణాలు పోయిం తరువాత కూడా ద్వేషాలెందుకు?'అని చెప్పిన హితవు పోలీసు అధికారులు తెలుసుకుంటే మంచిదే.

మీనూ, ఈపాటికి నీవు నీ ప్రియ సహచరుడి ద్వారా ప్రజల పట్ల మా గెరిల్లాల వైఖరీ, వ్యవహారం, ఆయనకు అర్థమైన మేరకు మా ప్రజా రాజకీయాలు తెలుసుకొని ఉంటావు. పార్థివ శరీరాలతో ఎవరికీ వైరం ఉండకూడదనే ఇంగిత జ్ఞానం, యుద్ధనీతి కడు హీన సంస్కృతికి అలవాటు పడుతున్న ఖాకీలకన్నా గెరిల్లాలకే ఎక్కువ తెలుసుననీ నీ కోబ్రా కమాండో భర్త నీకు చెప్పే ఉంటాడు. మీ రాకేశ్వర్ స్వభావం నాకు తెలియదు కానీ, మీ హైందవం స్త్రీలను 'చంచల స్వభావులు, కౄరులు, ఆలోచన లేని పనులు చేస్తారు' అంటూ నిత్యం నిందిస్తునే ఉంటుంది. మా ఆదివాసీ మహిళలు ఇంకా పూర్తిగా ఆ హీన దశకు చేరుకోలేదు. మాకు కొంత స్వేచ్ఛ, స్వతంత్రం ఇంకా మిగిలి ఉన్నాయి. కశ్మీరీ మహిళల గురించి కూడ కొంత

ప్రజాస్వామికంగా ఆలోచిస్తారని ఎక్కడో చదివాను. కాబట్టి నువు మరోసారి గట్టిగా రాకేశ్వర్‌కు ఆ కమాండో ఉద్యోగం వదులుకొమ్మని చెప్పు. ప్రజా కోర్టులో మా ప్రజలు కోరింది కూడ అదే! అలాగే, నువు వీలైనమేరకు మృత జవాన్‌ల భార్యలకు, పిల్లలకు రణభూమిలో జరిగిన వాస్తవాలను తెలియజేస్తావు కదూ!

మీనూ,

మే నెల రెండో ఆదివారం మాతృదినంగా జరుపుకుంటారనే సంప్రదాయం ఉందనే విషయం నీకు తెలుసో, లేదో నాకు తెలియదు. కానీ, ఈ సంవత్సరం అమ్మలదినం రోజు నీతో నీ పాప, రాకేశ్వర్‌తో ఆయన తల్లీ అవధులు ఎరుగని సంతోషంతో ఉంటారు. రాకేశ్వర్ విడుదల తరువాత మీరు మా పీ.ఎల్.జీ.ఏ. గెరిల్లాలకు కృతజ్ఞతలు తెలిపారు. ధన్యవాదాలు. మీనూ, ఇక్కడే నీకు ఒక విషయం చెప్పనా! దండకారణ్యానికీ, కశ్మీరానికి మధ్య ఉన్న ప్రజా పోరాట అనుబంధం రాకేశ్వర్ సింగ్ విడుదల విషయంలో ఒక బోనష్ పైంటులా పని చేసింది. కశ్మీరీ జాతి ప్రజలకు రాకేశ్వర్‌సింగ్ విడుదల ఒక విప్లవ సందేశాన్ని అందిస్తోందనే భావన కూడ కొంత పని చేసింది. ఇక నేను నీకు మానో, పుష్పలను పరిచయం చేస్తాను.

నీ ప్రియుడు గెరిల్లాల యుద్ధ బందీగా ఉన్న వారం రోజులకు ముందు మా ఆదివాసీ తల్లులు ఐదుగురు గర్భశోఖానికి గురైనారు. ఒకరిద్దరు పిల్లలు అమ్మ లేని వారయ్యారు. గర్భశోఖానికి గురైన వారిలో మా మానోదీదీ ఒకరు. వారిది హిచ్చామీ గోత్రం. ఆవిడకు తొమ్మిది మంది పిల్లలు. వారిది పేద కుటుంబం. కానీ, విప్లవోద్యమ ఫలితంగా ఇక్కడి వేలాది ఆదివాసీ కుటుంబాలకు సాగు భూములు లభ్యమైనట్టే మానోదీదీ వాళ్లకు దొరికాయి. ఆమె సంతానంలో రెండవవాడు మా పార్టీ నాయకుడు రుషి. రుషి కష్టజీవి. ప్రాథమిక చదువు వదిలి పేద కుటుంబ పోషణలో అమ్మా నాన్నలతో భాగమయ్యాడు. వాళ్ల ఊళ్లో జనతన సర్కార్ అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేసింది. సాగు భూములకు నీటి వసతి కల్పించడంతో మంచి పంటలు పండేవి. అనేక పేద కుటుంబాలు తమ కష్టంతో మధ్యతరగతికి ఎదిగినట్టు మానోదీదీ కుటుంబం ఆ స్థాయికి చేరింది. ఆ క్రమంలో రుషి విప్లవోద్యమంలో భాగమయ్యాడు.

గడ్‌చిరోలీ విప్లవోద్యమంలో భాగమైన రుషి భాస్కర్‌గా, పవన్‌గా ప్రజలకు సుపరిచయం. ఆయన జిల్లాలో పనిచేయని ప్రాంతం లేదు. ఆయనకు సెక్యూరిటీ గార్డుగా నా కూతురు అస్మిత ఉండే. నా కూతురు 12 వరకు చదువుకుంది. ఆయన మా అస్మితను ప్రాణంలా చూసుకునేవాడు. మా ఆదివాసీ పేద పిల్లలలో ఆడపిల్లలు 12 వరకు చదువుకోవడం సాధారణ విషయం ఏమీ కాదు. ఆ తరువాత నా కూతురు చదువు మానేసి నా బాటలో విప్లవమార్గం పట్టింది. నాకు ముగ్గురు మగ పిల్లలూ ఉన్నారు. గడ్‌చిరోలీ సీ-60 కమాండోలు మార్చ్ 29నాడు కోబ్రామెండ అడవిలో జరిపిన దాడిలో మా మానో దీదీ, నేనూ మా బిడ్డలను కోల్పోయాం. మాకు దూరమైన మా బిడ్డలను తలచుకొని ఈ సారి తల్లుల దినం నాడు

విలపించడం మా వంతు అవుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా యేటా ఏదో ఊరిలో, ఏదో ఇంట్లో తల్లుల దినం నాడు తల్లులు గర్భశోఖంతో గడపక తప్పడం లేదు. ఇది గత 20 ఏండ్లుగా యేటేటా పెరుగుతోంది.

నేనూ నీలాంటి ఒక తల్లినే. నా పాపకు నేను యోగితా అనే పేరు పెట్టుకున్నాను. ఆమె ఆ పేరును సార్థకం చేసింది. ఆమె ప్రజల కోసం తన ప్రాణాలను ధారపోసి ఆశయాల సాధనలో అసువులు ధారపోసిన అమర వీరాంగణయింది. నేను నా ఇళ్లు, పిల్లల్ని వదిలి ఎందుకు సాయుధమయ్యానో నీకు చెప్పలేదు కదూ!

ఇపుడు నీవు మొర పెట్టుకున్న మోదీ ప్రభుత్వం 2018లో ప్రకటించిన 35 'ఆకాంక్ష' జిల్లాల్లో మా గడ్చిరోలీ ఒకటి. 20 సంవత్సరాల క్రితం నాటికే నాకు యోగితా సహ నలుగురు పిల్లలు. అడవులలో ఆదివాసులు అనుభవించే దోపిడీ దౌర్జన్యాలు నీకు అంతగా తెలువకపోవచ్చు! కానీ, ఇపుడు మీ కశ్మీర్‌లో కూడా మోదీ పుణ్యమా అంటూ ఆర్టికల్ 370 రద్దు తరువాత అక్కడి ఆదివాసీలకు ఎదురవుతున్న అటవీశాఖ దౌర్జన్యాలు వార్తలలో నీవూ గమనించాలి. మన దేశంలోని అడవులలో నివసించే ఆదివాసీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. మా అడవులు అపారమైన ప్రాకృతిక వనరులకు నిలయం. పర్యావరణ పరిరక్షణకు ప్రాణం. పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ, అభివృద్ధి పేరుతో వనరులను కాజేయడమే ప్రభుత్వాల లక్ష్యం. ఇప్పటికే వారి విధానాలకు దేశంలోని కోట్లాది ఆదివాసులు విస్థాపితులయ్యారు. మీ వాల్మీకి రామాయణ కాలం నుండి మావి విస్థాపిత జీవితాలే! ఆ కవి మహానుభావుడే 14 వేల మంది మా మూలవాసులను మీ మర్యాద పురోషోత్తముడు సంహరించాడని రాశాడు. మా నగరాలను శుక్రుడనే మీ ఋష్యపుంగవుడెవరో శపించిన ఫలితంగా దండకుడి రాజ్యం అడవిగా మారిందని చెప్పాడు. అనాదిగా మా బతుకులపై బ్రాహ్మణం ఆ తరువాత దానితో జతకలిసిన సామ్రాజ్యవాదం దోపిడీ, దాడులు జరుగుతూనే ఉన్నవి.

విప్లవోద్యమ అండ మాకు లేకుంటే మేమూ, మా జీవితాలు ఈపాటికి తెల్లారిపోయేవి. అలా కాకూడదనీ నా భర్త మా కుటుంబాన్ని నాకు వదలి పాతికేళ్ల క్రితమే విప్లవోద్యమంలో చేరాడు. నేను ఇంటి వద్ద వ్యవసాయం చేస్తు, అటవీ ఉత్పత్తులు సేకరిస్తూ, కూలీ నాలీ చేసి ఆయన లేని లోటు తీర్చుకుంటూ కుటుంబాన్ని పోషించేదాన్ని. కానీ, పోలీసులు ఆయనను లొంగదీసుకోవడానికి నన్ను అనేక విధాలుగా వేధించారు. కుటుంబ హింస, తెగ హింస నాకు పెద్దగా ఎదురుకాలేదు కానీ రాజ్యహింస మాత్రం నన్ను వెంటాడింది. పోలీసులు మావాళ్ల ఇళ్లు కూల్చారు. ఇంట్లోని దినుసులు పాడు చేశారు. తుదకు పొట్ట గడువని స్థితిలో, రక్షణ, భద్రతా కరువైన దుస్థితిలో నా 4 పిల్లలలో యోగితాను మా అన్నయ్య చేరదీసి తమ ఊళ్లో చదివించాడు. ఖాకీ సంస్కృతి తెలసిన నావాళ్లు నన్నూ నా సహచరుడితో కలసి విప్లవోద్యమంలో జీవించడమే నాకు అన్ని విధాలా భద్రతా, రక్షణా అన్నారు. అదే నాకూ నచ్చింది. నేనలా విప్లవ

బాట పట్టాను. 'పసిబిడ్డలను, స్త్రీలను, వృద్ధులను హింసించకూడదు' అంటూ మీ ధర్మ శాస్త్రాలు ప్రభోదించే యుద్ధనీతిని రాముడి నుండి నేటి 'శియారాం' అనుచరుల వరకూ ఎక్కడా మీ పాలకులు పాటించలేదు.

నాకు ఇంటి వద్ద అక్షర జ్ఞానమే లేదు. కానీ, ఉద్యమంలో అ,ఆ లు దిద్దుకున్న నేను గత పదేళ్లుగా జనతన సర్కార్ పాఠశాలలో ఒక ఉపాధ్యాయినిగా పని చేస్తున్నాను. నా విద్యార్థుల ఆశ్రమంలో 50 మంది ఆదివాసీ పిల్లలు ఉంటారు. వారికి నేను ఒక తల్లిని, ఒక సంరక్షకురాలును, ఒక ఉపాధ్యాయినిని. మా పాఠశాలను కూడ పోలీసులు కాల్చారు. కూల్చారు. సక్రమంగా పిల్లల చదువు సాగనివ్వడం లేదు. అయినప్పటికీ ఆ పిల్లల భవిష్యత్తును విప్లవ మార్గంలో తీర్చిదిద్దటానికి నేను శాయశక్తులా పని చేస్తున్నాను.

మా జంట ప్రభావం మా పిల్లలలో ముఖ్యంగా నా కూతురుపై బలంగా ఉంటుంది. అదీ ఆడపిల్లే కావడం అందుకు ఒక కారణమై ఉంటుందేమో! నా బాటలో నా కూతురు పోరుదారి నడవడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. కానీ, నా కన్న కూతురు నా కళ్ల ముందే మా ఆదివాసీ ప్రజల కోసం, వారి అస్తిత్వం కోసం, వారి అస్మిత కోసం తాను అస్మితగా నిలిచి పోరాడి అమరమైంది. ఇపుడు దాని అసంపూర్ణ లక్ష్యాలు, ఆశయాలు నేను ముందుకు తీసుకువెళ్లాలి. నాకు ఇపుడు అస్మిత కన్నా చిన్నారులు 50 మంది పిల్లలున్నారు. వారంతా నాకు యోగితా లాంటి వాళ్లే. వాళ్లకు నేనొక అమ్మను. వాళ్లలో కొందరు నన్ను అలాగే సంభోదిస్తారు. ఇక వారిలోనే నేను నా యోగితాను నిత్యం చూసుకుంటాను. ముందరికన్నా మరింత పట్టుదలగా, మరింత బాధ్యతగా అమరుల ఆశయాల సాధనకై కృషి చేస్తాను.

ఇక్కడ నేను నా కూతురుతో పాటు ఆ బ్యాటిల్‌లో ప్రాణాలర్పించిన కామ్రేడ్ అమర్ గురించి తప్పక చెప్పాలి. ఆయన అద్భుతమైన గెరిల్లా. నలువైపులా చుట్టుముట్టిన శతృవును గండి కొట్టుకొని పోవాలనీ పవన్ ఆదేశించి అమర్‌ను బ్రేకింగ్‌టీం సభ్యున్ని చేశాడు. అమర్ అరవీర భయంకర రూపం దాల్చి కమాండోలను దనుమాడాడు. ఎదురుగా ఉన్న కమాండో గుండెలపై గురి చూసి కాల్చాడు. కమాండో నూకలు చెల్లిపోయాయి. మరో వైపు మరో గెరిల్లా మరో కమాండోను నేల కూల్చాడు. దానితో ఏర్పడిన గండిని అదునుగా తీసుకొని గెరిల్లాలు కిల్లింగ్‌జోన్ నుండి బయటపడ్డారు. కానీ, ఆ కాల్పుల మధ్య అమర్ వీరమరణం పొందాడు. ఆ ప్రజా వీరుడి త్యాగానికి రెడ్‌శల్యూట్స్. అమర్‌కు అమ్మా నాన్న లేరు. వాళ్ల నాన్నను బస్తర్‌లో 2005-09 మధ్య శ్వేత భీభత్సం సృష్టించిన ఫాసిస్టు సల్వాజుడూం గూండాలు హత్య చేశారు. గడ్‌చిరోలీ ఉద్యమ అవసరాల రీత్యా పార్టీ పంపగా ఆయన అక్కడి ఉద్యమంలో భాగమయ్యాడు. ఆ మట్టికే అంకితమయ్యాడు. కానీ, ఆయన శవం.....! సుక్మా, బీజపుర్, దంతెవాడ తదితర జిల్లాలకు చెందిన వారు గడ్‌చిరోలీలో అమరులవుతున్నపుడు వారి పార్థివ శరీరాలను పోలీసులే పూడ్చిపెడుతున్నారు. దీనిని వారి చట్టం కూడ ఆమోదించదు.

అన్ని విధాలా తమకు సేవలందించే పోలీసుల శవాలనే బాధ్యత రహితంగా వదిలేస్తున్న అధికారులు మా పిల్లల శవాలకు ఏపాటి సంస్కారంతో అంత్య సంస్కారం చేస్తారో తలచుకుంటేనే ఒక తల్లిగా నా మనసు తట్టుకోలేకపోతోంది. ప్రాణం లేని మనిషితో వారెలా వ్యవహరిస్తున్నప్పటికీ మా పీఎల్‌జీఏ మాత్రం అత్యంత బాధ్యతగా ప్రతి అమరుడి జ్ఞాపకాలను (బట్టలు, ఫోటోలు మున్నగునవి) మా సంప్రదాయం ప్రకారం వారి కుటుంబాలకు అందచేస్తోంది. వారి స్వస్థలంలో జనతన సర్కార్లు, ప్రజలు విప్లవ సంప్రదాయాలతో మా ఆదివాసీ సంప్రదాయాలనూ కాదనకుండా వీరులకు అంత్య సంస్కారాలు జరుపుకోవడం ఒక విప్లవ పరిపాటిగా మారింది.

మీనూ, చివరగా చెప్పేదేమంటే, మా పోరాటం మానవాళి విముక్తి కోసం సాగుతోంది. మా విప్లవ ఆశయం ఉన్నతమైంది. న్యాయమైన మా పోరాటాన్ని దోపిడీ పాలకులు సహించడం లేదు. అందుకే నీ భర్త లాంటి వాళ్లతో కోబ్రా విషనాగులను తయారు చేస్తున్నారు. ఒక చోట హాక్స్, మరో చోట స్కార్‌పియాన్, ఇంకోచోట గ్రేహౌండ్స్, ఒకచోట జాగ్వార్ ఇలా ఒక్కొక్కచోట ఒక్కొక్క పేరుతో ప్రజల మీదికి తమ బలగాలను క్రూర జంతువులలాగా తయారు చేసి వదలుతున్నారు. పాలకులు ప్రజలను విభజించు-పాలించు పద్ధతులను అనుసరిస్తున్నారు. జీతం రాళ్ల కోసం ఖాకీలు మాత్రం దోపిడీదారుల రక్షణ కోసం, వారి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు. అపార ప్రాకృతిక వనరులకు నిలయమైన మా దండకారణ్యానికి, ఝార్ఖండ్ అడవులకు వారి హుకుంపైనే చేరారు. పోలీసులకు అసలు వాస్తవాలు అంటే దోపిడీ రహస్యాలు తెలియవు. మా జీవితాలూ, ఆచార వ్యవహారాలు, భాష, సంస్కృతి, కట్టుబాట్లు అంతకన్నా తెలియవు. వారికి వారి అధికారులు తలకెక్కించే తప్పుడు దేశభక్తి, ప్రజా సేవే అర్థమైంది. ఈ దేశ పాలకులు తమ చేతిలోని మీడియా ద్వార మావోయిస్టులంటే ఉగ్రవాదులనే రెచ్చగొట్టె ప్రచారం విస్తృతంగా కొనసాగిస్తున్నారు. ఆ పని వారు ఎంత బలంగా చేస్తున్నారో మీ రాకేశ్వర్ మావారి ఆధీనంలో ఉన్నపుడే అర్థమైంది. అందుకే నేను ఇంత వివరమైన లేఖ నీకు రాస్తున్నాను. మేం ఉగ్రవాదులం కాము. హంతకులం అంతకన్నా కాము. దోపిడి మేమెరుగం. దౌర్జన్యం అనే పదం మా పదకోశంలోనే లేదు. మేం ప్రజాస్వామ్యాన్ని ప్రేమిస్తాం. అదీ ప్రజల ప్రజాస్వామ్యాన్నే సుమా! పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉత్త మోసం.

ఈ సంవత్సర తల్లుల దినం నాడు నేను ఈ విషయాలను నీతో పంచుకొని ఖాకీలుగా యూనీఫాంలు ధరించి పేదలపై విరుచుకుపడుతున్న పోలీసులకు వాస్తవాలను చెప్పి వారిని ప్రజలలో భాగంగా నిలపాలనుకున్నాను. అందుకే, నా మనసులోని మాటలు ఇలా నీతో పంచుకుంటున్నాను. మీనూ! మీ ఆయనకు మా వాళ్లు ఈ విషయాలన్నీ చెప్పి ఉంటారు. నువూ ఆలోచించు. సరేనా!

కోబ్రామెండ దాడిలో నేను నా కూతురును కోల్పోతే నా విప్లవ సోదరీ సుజాత ఆత్రం ప్రాణత్యాగం చేయడంతో తన కొడుక్కి తల్లి లేకుండా అయిపోయింది. ఆమె కొడుకును పోలీసులు

చేరదీసి తమ పక్షం మార్చుకోవడానికి వాడిని ఒక లంపెన్‌గా, క్రిమినల్‌గా తయారుచేస్తున్నారు. ఆమె భర్త ఒక విప్లవకారుడు. ఆమె కూడ నాలాగే తన ప్రియ సహచరుడితో కలిసి విప్లవోద్యమంలో భాగమైంది. వారిది ఇంటి వద్ద పెద్దలు చేసిన పెళ్లే. ఆమె భర్త గత ఏడేళ్లుగా చంద్రపుర్ జైళ్లో ఉన్నాడు. ఆయనకు ప్రజా వ్యతిరేక న్యాయస్థానంలో శిక్ష పడింది. సుజాత మరణవార్త ఆయన్ని ఎంతగా కలిచివేస్తుందో రాకేశ్వర్ కోసం ఎంతగానో ఆరాటపడిన నీకు నేను విడిగా చెప్పాలా! అయితే ఇక్కడ నేను ఒక చేదు నిజం చెప్పాలి. రాకేశ్వర్ లేకుంటే మీకు దిక్కు లేదు. ఆయన సంపాదన పైనే ఆధారపడి బతికే జీవితాలు మీవి. కానీ, మాలో ఏ ఒక్క మహిళ పురుషుడిపై ఆధారపడి జీవించడం లేదు. విప్లవ రాజకీయాలతో ప్రజల మధ్య ప్రజల కోసం ప్రజలతోనే మేం ఉన్నాం. ఉంటాం. మేం స్వతంత్ర జీవులం. స్వేచ్ఛగా బతుకుతున్నాం.

ఇంకా మా దండకారణ్య అడవులలో మీ వరకు చేరని అనేక పాత్రలు, అనేక వెతలున్నాయి. మూలవాసీ ప్రజలపై ఇక్కడ జరుగుతున్న ఘోరాలన్నీ మీ రాకేశ్వర్‌కు తెలుసు. ఎందుకంటే ఆయన వాటిలో నిన్నటివరకూ ఏదో రూపంలో భాగమే అయ్యాడు కదా! కానీ, మా వెతలు, మా కథలు, మా జీవిత సత్యాలు సోకాల్డ్ మెయిన్ స్ట్రీం మీడియా పట్టించుకోవడం లేదు. ఒకవేళ రాసినా ఈ మధ్య చాలా పాపులర్ పదంగా ఉనికిలోకి వచ్చిన గోదీ మీడియా అవాకులు, చవాకులతో వక్రీకరించే రాస్తుంది. వారికి సంచలన వార్తలు కావాలి. కానీ, పేద ప్రజల జీవితాల వెతలు సంచలన వార్తలూ కావు కదా! అందుకే ప్రజల పక్షాన నిలిచే ఒక ప్రత్యామ్నాయ మీడియా ముందుకు వచ్చిననాడు మా యోగితా సహ అలాంటి అనేక మంది మా బిడ్డలు ధృవతారలనే విశ్వాసంతో ఉన్నాను. అపుడే వాస్తవాలు ప్రపంచ వినువీధులలో వినిపిస్తాయి, దర్శనమిస్తాయి. ఆ రోజు ఎంతో దూరం లేదు. ఢిల్లీ రైతులు తమ కోసం తమ 'ట్రాలీ టైమ్స్'ను ప్రారంభించడం అభినందనీయం.

మీనూ నేను ఇక ఉంటా! ఈ ఆదివాసీ అమ్మ ఆవేదన గుర్తుపెట్టుకో, దోపిడీ ప్రభుత్వాల తరపున ఖాకీ యూనీఫాంలు ధరించవద్దని జీరగూడ మృత పోలీసుల కుటుంబాలు ప్రచారం చేయాలి. అర్ధసైనిక బలగాలలో ఆత్మహత్యలు కూడ పెరుగుతున్నాయి. జీరం ఘటన జరిగి వారమైనా గడువకముందే కాంకేర్ జిల్లాలో బీఎస్ఎఫ జవాన్ లక్నోవాసీ ప్రదీప్ శుక్లా ఆత్మహత్య చేసుకున్నాడు. భారత సైనికులలోనూ ఈ ధోరణి ఆందోళనకరంగానే ఉంది. తల్లులుగా మనం వీటినీ నివారించాలంటే మన పిల్లలకు సైనిక దుస్తులు ఎక్కించవద్దు.

మాతృదిన వందనాలతో,

ఒక తల్లి, (అస్మిత తల్లి)

(పుష్ప పద్దా), ఉపాధ్యాయిని,

డీ.కే. జనతన సర్కార్ పాఠశాల.

(దండకారణ్య గెరిల్లాల అదుపులో నుండి కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హాస్ విడుదలై మాతృదినం నాటికి సరిగ్గా నెల రోజులవుతున్న ససందర్భంగా.....)